# ...అయినా, నువ్వంటే నాకిష్టం

- ముచ్చర్ల రజనీశకుంతల

''ప్రేమంటే, ప్రేమించి మరచిపోవడమనే సెటైరు కాదు, ప్రేమించు మరణించే వరకూ అనే సూక్తి కాదు, మరణించాక కూడా నిన్ను మరిచిపోలేను సుమా.. అని చెమర్చే మనసుతో చెప్పే భావమే.. అందుకే, అయినా, నువ్వంటే నాకిష్టం. ఇది ప్రేమను బ్రతికించిన ఓ ప్రేమైకజీవి భాష్యం!

• • •

''మెల్లిగా.. మెల్లిగా లేవండి..'' శరత్‌చంద్రని వీల్ చెయిర్‌లో నుంచి, తన భుజం ఆసరాతో లేపుతోన్న విదుర అంది.

విదుర వైపు చూసి, ఆమె భుజంమీద తన చేతిని బలంగా బిగించి, పళ్ళబిగువున బాధను అణిచిపెట్టుకుంటూ నిలబడే ప్రయత్నం చేస్తున్నాడు శరత్ చంద్ర.

సవత్సరంక్రితం, అల్లరిచేస్తూ, గంతులువేస్తూ, కారును అతివేగంగా నడిపే శరత్‌చంద్ర.. ఇప్పుడు నిస్సహాయుడు. ఎన్నో కార్లరేసుల్లో ఎప్పుడూ ఫస్ట్ వచ్చే అతడు, ఏ రేస్‌లోనూ పాల్గొనకుండా, జీవితమనే రేసులో ఘోరంగా ఓడిపోయాడతను.

శరత్‌చంద్ర భార్య విదుర.

ఇద్దరిదీ ప్రేమ వివాహమే. విదేశాల్లో చదువుకొని, అక్కడి ఫాస్ట్‌లైఫ్‌ని, ఫాస్ట్‌గా గడిపేయక, స్వదేశానికి తిరిగొచ్చి, తనకు నచ్చిన విదురను కాణీ కట్నంలేకుండా పెళ్ళిచేసుకున్నాడు. లంకంత బంగ్లా, కార్లూ, నౌకర్లూ.. దేనికీ లోటులేదు. ఒక్క ఆరోగ్యానికి తప్ప.

పెళ్ళయి మూడు రాత్రుల ముచ్చట ముగిసిన మరునాడే భార్యను తీసుకొని, టీ ఎస్టేట్‌ను చూపిస్తానని చెప్పి, ఓ చల్లని సాయంకాలం ఆమె భుజంమీద ఓ చేయేసి, మరోచేత్తో స్టీరింగ్‌ను అలవోకగా, సుదర్శన చక్రంలా తిప్పుతూ.. అప్పటికీ ''అమ్మో.. స్పీడు తగ్గించండి.. నాకు భయమని..'' ఆమె అతనివైపు ఒదిగిపోతూ అంటూ వుంటే, మరింతగా భార్యను ఆటపట్టించాలని, కారు వేగం పెంచి.. పెంచి.. స్ప్లిట్ సెకండ్‌లో ఊహించని దారుణం ప్రూహాతీతమై, ఘోరాతి ఘోరమైంది. రోడ్డు మలుపులో పెద్ద శబ్దంతో.. యాక్సిడెంట్.

విదుర పెద్దకేక వేసి స్పృహ తప్పిపడిపోయింది. కళ్ళు తెరిచి చూస్తే...

• • •

''తనకు.. తనకెలా వుంది డాక్టర్..'' హాస్పిటల్‌లో బెడ్‌మీద తీవ్ర గాయాలతో వున్న విదుర డాక్టర్స్‌ని అడిగిన మొట్టమొదటి ప్రశ్న అది.

''ముందు మీరు రిలాక్సవ్వండి.. ఇంకా మీరా షాక్ లోనుంచి కోలుకోలేదు..'' డాక్టర్స్ ఆమెను సముదాయించబోయారు.

''అయామ్.. అయామ్ ఆల్‌రైట్ డాక్టర్.. ముందు ఆయనకెలా వుందో చెప్పండి...'' విదుర కంఠంలో ఆందోళన.

''హి ఈజ్ ఆల్‌రైట్.. బట్..''

''బట్.. చెప్పండి డాక్టర్...''

డాక్టర్స్ ఒక్కక్షణం తటపటాయించారు.

''డాక్టర్.. అతని ప్రాణానికేమీ ముప్పులేదు కదా..''

''లేదు..''

''దెన్.. ఇప్పుడు చెప్పండి.. దేన్నయినా తట్టుకోగల్ను'' స్థిరంగా అంది.

''అతని కాళ్ళు యాక్సిడెంట్‌లో నుజ్జు నుజ్జు అయ్యాయి. వెన్నెముకకు బలమైన గాయం తగిలింది. అతను.. అ..త..ను.. సంసార జీవితానికి పనికిరాడు.''

పెద్ద విస్ఫోటం.. చిన్న అలజడి.. ఒంట్లో కనిపించని జలదరింపూ.. అదీ.. అదీ కొద్దిసేపే.. వెంటనే తేరుకుంది.

''థాంక్యూ.. డాక్టర్.. అతని ప్రాణానికేమీ ముప్పులేదన్నారు. అది.. అదిచాలు. నేను.. నేనిప్పుడు అతడ్ని చూడొచ్చా'' మెల్లిగా లేచే ప్రయత్నం చేస్తూ అంది విదుర.

''ముందు మీరు రిలాక్సవ్వండి. సాయంత్రం చూద్దురుగానీ..'' అలసటగా కళ్ళు మూసుకుంది విదుర.



విదురకు తెలియదు, ఈ మాటలన్నీ పక్కవార్డులో వున్న శరత్‌చంద్ర విన్న విషయం. చిత్రంగా అతనికి ఏడ్పు రావడంలేదు.

• • •



ఘోరంగా సంవత్సరం గడిచింది.

మూడు వందల అరవై అయిదు రోజులు..

నెలకు ముప్పయి రోజులు..

రోజుకు ఇరవై నాలుగు గంటలు.. గంటకు అరవై నిముషాల పర్యంతం విదుర శరత్‌చంద్రను అంటిపెట్టుకునే వుంటోంది. హరిప్రసాద్ అనే స్పెషలిస్టు పర్యవేక్షణలో శరత్‌చంద్రకు వైద్యం జరుగుతోంది.

శరత్‌చంద్ర లేవలేడు. కదలలేడు. అతను రాత్రివేళ, వీల్ చెయిర్‌లో నుంచి మంచం మీద పడుకోవటమే గగనం. విదుర, హరిప్రసాద్‌లు చెరోవైపు పట్టుకొని అతడ్ని లేపాల్సిందే. ఆరోజు హరిప్రసాద్ రావటం ఆలస్యమైంది. విదుర ఒక్కర్తే శరత్‌చంద్రని వీల్ చెయిర్ నుంచి లేపి, మంచం మీద పడుకోబెట్టింది. అతనికి దుప్పటి కప్పి, బెడ్‌లైట్ వేసి, తను బాత్రూంలోకి వెళ్ళింది.

అప్పుడు సమయం అర్ధరాత్రి పన్నెండు కావస్తోంది. నిశ్శబ్దంగా వున్న ఆ బెడ్‌రూమ్‌లో నుంచి సన్నటి శబ్దం. బాత్రూంలో షవర్ నుంచి సన్నటి నీళ్ళ ధార శబ్దం. ఆమె కన్నీళ్ళు నీటిధారగా ఒంటిమీదకి జారుతున్నాయి.

బట్టలను ఓ మూలకు గిరాటేసి, షవర్ కింద నిలబడి చన్నీళ్ళ స్నానం చేస్తోంది విదుర. సంవత్సరం కాలంగా విదుర ఇలా చేస్తూనే వుంది. ఉప్పూ, కారం తగ్గించింది. చలిస్నానాలు మొదలెట్టింది కోరికలను చంపుకునే ప్రయత్నంలో భాగంగా.

శరత్‌చంద్ర గమనిస్తూనే వున్నాడు. అతనిలో ఓ స్థిర నిశ్చయం. అది ఎటువైపు దారి తీస్తుందో?

• • •

''హలో.. నేను హరిప్రసాద్‌ని.. చెప్పండి..''

''నేను శరత్‌చంద్రని మాట్లాడుతున్నాను. కాస్త నడుంలో పెయిన్‌గా వుంది. అర్జంట్‌గా నారూమ్‌కి రాగలరా?''

''వెంటనే వస్తున్నా..'' అంటూ హడావిడిగా శరత్‌చంద్ర గదికి వచ్చాడు హరిప్రసాద్.

కళ్ళు మూసుకొని ఉన్నాడు శరత్‌చంద్ర.

''ఏమైంది?'' ఆదుర్దాగా అడిగాడు హరిప్రసాద్.

''నొప్పిగా అనిపించింది. ఇప్పుడు తగ్గింది'' అన్నాడు హరిప్రసాద్ వైపు పరిశీలనగా చూస్తూ. ముప్పయ్యేళ్ళ వయసుంటుంది. ధృడంగా వుంటాడు. మొహమ్మీద చిర్నవ్వు ఎప్పుడూ కదలాడుతూ ఉంటుంది.

• • •

వంటికి టవల్ చుట్టుకొని, బాత్రూం తలుపు తెరుచుకొని గదిలోకి వచ్చి హ్యాంగర్‌కు వున్న నైటీ అందుకోబోయి, ఎదురుగా వున్న హరిప్రసాద్‌ను చూసి కంగారుపడింది. ఆమె వంటికి వున్న టవల్ జారిపడిపోయింది కంగారులో.

ఒక్కక్షణం.. బలవంతంగా కళ్ళు తిప్పుకున్నాడు హరిప్రసాద్. అతనూహించని విషయం.. వెంటనే లేచి బయటకు వెళ్ళిపోయాడు.

విదుర ఇంకా ఆ షాక్‌లోనే వుంది.

శరత్‌చంద్ర ఏమీ తెలియనట్టే కళ్ళు మూసుకొని పడుకున్నాడు.

విదుర వెంటనే తేరుకొని నైటీ అందుకొని వేసుకుంది. గబగబ వెళ్ళి రూమ్ గడియపెట్టింది. హరిప్రసాద్ మీద కోపం పీకల్దాక వచ్చింది. ఈవేళలో.. వెంటనే అనుకుంది.. బహూశ శరత్‌చంద్ర కోసం.. వచ్చాడేమో.. తనకేం తెల్సు. ఈ టైమ్‌లో ఎవరొస్తారని



## లక్ష కటింగ్

నెల్సన్ మండేలా పుట్టినరోజు సందర్భంగా బెంగుళూరుకు చెందిన ముత్తురాజ్ మరో పాతికమందితో కలిసి ఓ బృహత్కార్యాన్ని చేపట్టాడు. అదేమిటంటే మొత్తం లక్షమంది దళితులకు ఉచితంగా హెయిర్ కటింగ్ చేయాలని సంకల్పించుకున్నాడు. సరే అంతవరకూ బాగానే వుంది. అయితే స్వతహాగా ఆటోడ్రైవర్ అయిన ముత్తురాజ్ మరో పాతికమంది ఆటోడ్రైవర్లతో కల్సి ఉచితంగా చేసే హెయిర్‌కటింగ్ ఎంత అందంగా వుంటుందోనని జనం భయపడిపోతున్నారు.

## కరెన్సీ టెర్రరిజం

భారతదేశాన్ని అల్లకల్లోలం చేసేందుకు శత్రుదేశాలు నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటాయి. లేటెస్ట్‌గా పాకిస్థానీ గూఢచార సంస్థ ఐయస్ఐ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు కొత్తరకం టెర్రరిజం మొదలుపెట్టింది. దొంగ ఐదువందలు, వంద, యాభై రూపాయల నోట్లను విస్తృతంగా ముద్రించి దేశంలోకి పంప్ చేయటం మొదలుపెట్టింది. ఢిల్లీ, హర్యానా, గుజరాత్, జమ్మూ, ఈశాన్య రాష్ట్రాల్లో ఈ దొంగ పాకిస్తానీ నోట్లు ఎక్కువగా చెలామణీ అవుతున్నాయి. టెర్రరిస్టులను సరిహద్దు దాటించటంతోపాటు పాకిస్తాన్ చేస్తున్న ఈ కరెన్సీ టెర్రరిజం గురించి అంతర్జాతీయస్థాయిలో చర్చలు జరుగుతున్నాయి.

**- అట్ల రవికుమార్**




టపల్‌తోనే రూమ్‌లోకి వచ్చింది. ఎంత అసహ్యకరమైన పరిస్థితి...

తన తప్పు లేకపోయినా ఏదో గిల్టీగా..

అసహనంగా.. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. చిన్న ప్రకంపనం..

శరత్‌చంద్ర నిద్ర నటిస్తున్నాడని మాత్రం తెలియదు.

• • •

హరిప్రసాద్‌కు గిల్టీగా వుంది. తన గురించి విదుర ఏమనుకుందో? శరత్‌చంద్ర ఈ దృశ్యం గమనించాడా?

తెల్లారాక, శరత్‌చంద్రను మెడికల్ చెకప్ చేస్తూ, లో గొంతుకతో విదురకు 'సారీ' చెప్పాడు.

• • •

ఇద్దరూ చెరోవైపు సాయంపట్టి శరత్‌చంద్రను మంచంమీద పడుకోబెడుతూంటే, శరత్‌చంద్ర కావాలనే తన బరువును విదుర మీద పెట్టేడు. విదుర ఆ బరువును మోయిలేకపోతోంది. అది గమనించిన హరిప్రసాద్.. విదురకు సాయంగా అటువైపు వెళ్ళాడు. ఆ ప్రయత్నంలో విదురను దగ్గరగా తాకాల్సివచ్చింది. వెంటనే తడబడ్డాడు.

• • •

శరత్‌చంద్ర ప్రవర్తన అనూహ్యంగా మారిపోయింది.

అతనిలో అనుమానం విశ్వరూపం దాల్చింది.

''రోజు రోజుకూ నీ ప్రవర్తన మారిపోతోంది'' శరత్‌చంద్ర విదురతో అన్నాడు.

''ఏ విషయంలోనండీ..'' అంది అర్థంగాక విదుర.

''నీకు తెలీదా? అయినా హరిప్రసాద్‌ను నాకు పర్సనల్ డాక్టర్‌గా తీసుకు వచ్చింది నువ్వేకదూ...''

''ఇండియాలో ఎఫిషియంట్ డాక్టర్ మరొకరు లేరని..'' ఆపై ఏం మాట్లాడాలో అర్థంకాలేదామెకు.

''అలాగా..'' అంటూ ఆమెను నఖశిఖ పర్యంతం చూసాడు.

విదుర విస్మయంగా చూసింది.

''ఏంటీ.. తనని తన భర్త అ...ను...మా.. ని...స్తు... న్నా...డా?''

• • •

రాత్రి ఒంటిగంట అవుతుందనగా, కంగారుగా శరత్‌చంద్ర పడగ్గది వైపు పరుగెత్తుకెళ్ళాడు హరిప్రసాద్. అంతక్రితమే తనకు విపరీతమైన పెయిన్ వస్తూందని బాధతో ఫోన్ చేసాడు శరత్‌చంద్ర. మరింకేమీ ఆలోచించలేదు.

పడగ్గదిలోకి అడుగుపెట్టిన హరిప్రసాద్ బిత్తరపోయేడు. మంచం మీద ప్రశాంతంగా నిద్రపోతూ వుంది విదుర. శరత్‌చంద్ర ఎక్కడా కనపడలేదు. మరి శరత్‌చంద్ర ఏడీ..?

ఇంతలో బయట నుంచి ఎవరో గడియపెట్టిన శబ్దం.

''దొంగా.. దొంగా..'' అరిచాడు శరత్‌చంద్ర బయట నుంచి గడియపెట్టి.

విదుర లేచింది. పడగ్గదిలో తనూ, డాక్టర్ హరిప్రసాద్ ఉండడంతో ఎటూ పాలుపోలేదు.

'తను కాసేపు హాలులోనే వుంటానని' వీల్ చెయిర్‌లో వెళ్ళిన భర్త గుర్తొచ్చాడు. తను అలసిపోయి నిద్రపోయింది. ఇంతలో ఈ అరుపులు.

నౌకర్లు వచ్చారు. తలుపు తెరిచారు.

లోపల ఏ తప్పూ చేయకపోయినా, దోషుల్లా హరిప్రసాద్, విదుర.

• • •

''ఛీ..'' ఒకే ఒక అక్షరం. ఒకే ఒక్క 'ఛీ'త్కారం. కానీ వేనవేల ఏహ్యాభావాలు శరత్‌చంద్ర గొంతులో.

అవమాన భారంతో బిక్కచచ్చిపోయింది విదుర.

హరిప్రసాద్ స్థాణువయ్యాడు.

ఆక్షణం నుంచే విదురకు సాధింపులు ఎక్కువయ్యాయి. హరిప్రసాద్ అక్కడ్నుంచి వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు. అతడు వెళ్తే భర్తకు వైద్యపరమైన సేవలు అందించే ఎఫిషియంట్ పర్సన్ దొరకడం కష్టం.

ఏమీ చేయలేని సందిగ్ధం. ఆమె అలసిపోయింది మానసికంగా, శారీరకంగానూ!

• • •

''విదురగారూ... ఈవారం రోజులుగా ఏ నేరమూ చేయకుండా మనం శిక్ష అనుభవిస్తున్నాం... నేనో నిర్ణయానికి వచ్చాను. మనమీద ఎలాగూ అక్రమ సంబంధం వుందని ముద్రపడింది. ఇప్పుడు మనం ఏం చేసినా ఆ ముద్ర తొలగిపోదు. పనివాళ్లు మనల్ని చూడ్డంతోనే అసహ్యంగా మొహాలు తిప్పుకుంటున్నారు... భర్తగా అతను నిన్ను అనుమానించి, ద్వేషిస్తున్నాడు. ఆరోగ్యరీత్యా అతను నిన్ను చూసినప్పుడల్లా బరస్ట్ అవ్వడం, నువ్వు ఎదురుగా కనిపిస్తే చూస్తూ ద్వేషించడం అతనికీ మంచిదికాదు. మనం... పెళ్లిచేసుకుందాం... ఇక్కడ్నుంచి ఎక్కడికైనా వెళ్లిపోదాం... మరో మంచి డాక్టర్‌ని నేను అపాయింట్ చేస్తాను... ఇది అతని ఆరోగ్యానికి, మన మీద పడ్డ నిందనుంచి బయట పడ్డానికి ఓ మార్గం!

ఆ నిందని నిజం చేసి దంపతులమైతే, కనీసం మనల్ని వేలెత్తి చూపకుండా అయినా వుంటారు'' హరిప్రసాద్ తన అభిప్రాయాన్ని చెప్పాడు.

విదుర ఆలోచనలో పడింది.

ఈవారం రోజులుగా మానసికంగా మాటలతో హింసిస్తున్నాడు శరత్‌చంద్ర.

అతని కోసం కోరికలనూ, అన్నింటినీ చంపుకుంది. తనమీద నమ్మకం లేక, తన క్యారెక్టర్‌ని ఎసాసినేట్ చేస్తోన్నా భరించింది. చివరికి పనివాళ్ల ముందు కూడా తనని అనుమానించి, అవమానించాడు.

విధిలేక నిర్ణయం తీసుకుంది.

ఆరోజు రాత్రే హరిప్రసాద్‌తో కలసి వెళ్లిపోయింది విదుర.

ఆ రాత్రి...

ఎ.సి కూపే అది. కిటికీ పక్కన కూచొని ఆలోచిస్తున్నాడు హరిప్రసాద్. విదుర నిద్రపోతోంది అతని ఒళ్లో తల పెట్టుకుని.

అతను ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు.

అతనికి వారం రోజుల ముందు జరిగిన సంఘటన కళ్లకి కనపడసాగింది.

• • •

''హరిప్రసాద్‌గారూ... మీతో పర్సనల్‌గా మాట్లాడాలనే విదురను అభిషేకం పేరుతో గుడికి పంపించాను. మిమ్మల్నీ, విదురను కలపాలనే వారం రోజులుగా మీ ఇద్దర్నీ మాటలతో హింసించాను, అనుమానించాను. గదిలోకి పిలిచి, బయటనుంచి గడియ వేసి నానా రభస సృష్టించాను. సంవత్సరకాలంగా విదుర మానసిక, శారీరక నరకాలను అనుభవిస్తోంది. నామీద ప్రేమ, సాంప్రదాయాల మీద వున్న నమ్మకం ఆమెలోని కోరికలను నియంత్రిస్తోంది. అలా కాకూడదు. మిమ్మల్ని గమనించాను. సంవత్సరకాలంగా, సన్నిహితంగా వున్నా, ఇద్దరూ ఎవరి హద్దుల్లో వాళ్లున్నారు. మీరు... మీరెందుకు ఒకటి కాకూడదు. నేను మోడుబారిన చెట్టును. ఇంక చిగురించే అవకాశమే లేదు. భర్తగా మూడు రాత్రులు, జీవిత కాలానికి సరిపడే ఆనందం అనుభవించాను. ఇప్పుడు ఆమెకు భర్తగా తగను. పెళ్లిలో వేదమంత్రాలు, వాగ్దానాలు వుంటాయి. ఆమె తోడుగా, నీడగా అన్ని వేళల్లో అంటిపెట్టుకోవాలి. భార్య భర్తకు పడగ్గదిలో రంభలానూ, పనివేళలో పనిమనిషిగానూ, అన్నం పెట్టేటప్పుడు తల్లిగానూ వుంటుంది. మరి భర్త అనేవాడు? నేనేమీ చేయలేనా!

ఇప్పుడు నేను తండ్రిలా ఆలోచిస్తున్నాను. నాభార్యను నీకిచ్చి పెళ్లి చేయాలనుకుంటున్నాను. అందుకు విదురను ఒప్పించే పూచీ నీది. ఈపాటికి నామీద విదురకు అసహ్యం కలిగించిందనే నా నమ్మకం... మీ ప్లేస్‌లో మరో డాక్టర్‌ని అరేంజ్ చేయండి. మీరూ, విదుర ఢిల్లీ కెళ్లండి. అక్కడ ఓ ఇల్లు మీకోసం కొనిపెట్టాను. ఈ నిజం విదురకు తెలియనివ్వొద్దు. ప్లీజ్'' రెండు చేతులు జోడించాడు.

• • •

రెండు కన్నీటి బొట్లు విదుర నుదురు మీద పడ్డాయి.

హరిప్రసాద్ మనసు చెమ్మగిల్లింది.

పెళ్లయిన నెల తిరక్కుండానే భార్యమీద మోజు తగ్గే భర్తలు, అకారణంగా అనుమానించే మొగుళ్లు వున్నారు. కానీ, తన భార్యకు తను పనికిరాడని, తండ్రి స్థానంలో వుండి పెళ్లి చేయాలనుకోవడం... ఓ జీవితంలో జరిగే కొన్ని సంఘటనలకు రీజనింగులూ, లాజిక్కులూ అవసరం లేదేమో..!

''నువ్వు దేవుడివి శరత్‌చంద్రా..!'' అనుకున్నాడు హరిప్రసాద్.

ఇవేమీ తెలియని విదుర చాలా రోజుల తర్వాత ప్రశాంతంగా నిద్రపోతోంది.

• • •

ఒంటరిగా హాలులో వీల్ చెయిర్‌లో కూచున్న శరత్‌చంద్ర అలసటగా కళ్లు మూసుకున్నాడు...

''సారీ విదురా... మూడు రాత్రుల మురిపాన్ని నీనుంచి జీవితకాలపు అనుభూతిగా అందుకున్నాను. సంవత్సరకాలంగా ప్రతీరోజూ, ప్రతి నిముషం నాకోసం నువ్వు పడే తపన చూసాను. నిద్రలేని రాత్రుళ్లు, చన్నీళ్ల స్నానాలూ... విదురా... భర్తంటే కేవలం భార్యని జీవితాంతం తనకు మాత్రమే 'బందీ'గా వుండాలనుకోవాలా? వద్దు విదురా... నీకీ శిక్ష వద్దు. భర్తగా నీనుంచి ప్రేమ అందుకున్నాను. ఇప్పుడు తండ్రిగా నీకు ఓ తోడు వెతికిపెట్టాను. ఇది తప్పు అని సాంప్రదాయాలూ, సమాజం ఘోషిస్తే ఘోషించుగాక. ఇదెక్కడి విడ్డూరమని ఆచారాలు నన్ను నిగ్గదీసినా ఐ డోంట్ కేర్... ఎందుకంటే ఏ కోరికా తీరకుండానే, జీవితకాలం మానసిక వైధవ్యం, వయసు తాలూకు కోరికలు నువ్వు చంపుకోవడం భరించలేను. ఎందుకంటే నువ్వు దూరమైనా... నువ్వు ఇప్పుడు మరొకరి సొత్తయినా... అయినా, నువ్వంటే నాకిష్టం.'' అనుకుంటున్న అతని కళ్లలో నుంచి రెండు కన్నీటి చుక్కలు అతని చెంపలపైన రాలాయి.

★

## కోడి కోరిక



ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారా? అదేనండి మన అభిమాన డైరెక్టర్ కోడి రామకృష్ణగారు ఏది చేసినా ఓ వెరైటీ (?) ఉంటుంది. అందుకే ఇంతవరకూ ఎవ్వరూ చెయ్యనివిధంగా కొత్త వెరైటీలో 'దేవుళ్ళు' అనే సినిమా తీస్తున్నారు. హైగా ఇండియాలో ఉన్న అన్ని దేవాలయాలు తీస్తున్నారట. మన హిందూ సాంప్రదాయాల్ని మరింత ప్రమోట్ చేసే ఉద్దేశంతోనే ఇలా రియల్ గుళ్ళు తీస్తున్నామని చెప్పారు. నిజానికి ప్రాక్టికల్‌గా ఆలోచించే ఏ నిర్మాతా ఈ సబ్జెక్ట్ విని ముందుకు రాలేకపోయినా, నా ఆశయం, ఇంట్రెస్ట్ చూసి చేగొండి హరిబాబు ధైర్యం చేసారని, వారి ఆశను వమ్ముకానీయనని చెప్పారు. ఇప్పటికే భద్రాచలం, షిరిడి, విజయవాడ కనకదుర్గ అమ్మవారు, శ్రీశైలంలోని దేవాలయాలు తీసామని, ఇంకా కాణిపాకం, తిరుపతి, అయ్యప్ప మొదలైన దేవాలయాల్లో షూటింగ్ ఉందని శలవిచ్చారు. ప్రేక్షకులూ! తీర్థయాత్రలకు వెళ్ళే బాధ మీకు తప్పించారు మన కోడి రామకృష్ణగారు. వారి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి!

\- విరాజి

